నిధులు దారి మళ్లింపు..!

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ప్రైవేట్ ఫ్యాక్టరీకి రోడ్డు
- రూ.1.10 కోట్ల కేటాయింపు వివాదాస్పదం
- దుర్వినియోగం అవుతున్న ప్రజాధనం

తాళ్లపూడి (కొవ్వూరు): ఉపాధి హామీ నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడని, కేవలం ఓ ప్రైవేట్ గ్లాస్ ఫ్యాక్టరీకి వెళ్లే రోడ్డు నిర్మాణం కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కేటాయించడం వివాదాస్పదమైంది. ఒకే రోడ్డుకు రూ.కోటి కేటాయించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలోని మిగిలిన రోడ్లు, డ్రైన్లకు నిధులు కేటాయించకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

మండలంలోని ఐ.పంగిడి పరిధిలో ఉన్న దేచర్లలో గ్లాస్ ఫ్యాక్టరీకి వెళ్లే అప్రోచ్ రోడ్డుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.కోటి, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు కలిపి మొత్తం రూ.1.10 కోట్లు ప్రైవేట్ ఫ్యాక్టరీ కోసం పేర్లు మార్చి నిబంధనలకు విరుద్ధంగా కేటాయించి రోడ్డును వేశారు. అయితే గ్రామంలోని ఇతర రోడ్లు, డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నా వాటికి నిధులు కేటాయించట్లేదని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు మీకోసంలో గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు ఫిర్యాదు చేశారు. స్థానిక జనసేన నాయకుడు పీకే రంగారావు కూడా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో టీడీపీ, జనసేన మధ్య నిధుల కేటాయింపు విషయంలో విభేదాలు నెలకొన్నాయి.

ఒక రోడ్డుకు నాలుగుసార్లు అంచనా వ్యయం

దేచర్లలో వేసిన ఈ రోడ్డును నాలుగు భాగాలుగా విభజించి నిధులు కేటాయించారు. రెండు రోడ్లకు ఒక్కో దానికి రూ.30 లక్షలు చొప్పున, మరో రెండు భాగాలకు రూ.20 లక్షలు చొప్పున మొత్తం రూ.కోటి కేటాయించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిబంధనలకు విరుద్ధంగా, వెడల్పు పెంచడానికి పక్కపక్కన రెండు రోడ్లు నిర్మించడం, 3 లేయర్లతో డబ్ల్యూబీఎం రోడ్డు (సత్రు) వేయడం, ఒకే రోడ్డుకు 4సార్లు అంచనా వేసి, కుడి, ఎడమ భాగాలుగా విభజించి సమాంతరంగా 8 మీటర్లు వెడల్పుగా నిర్మించడం చట్ట విరుద్ధం. ఇది ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిబంధనలకు విరుద్ధం అని, ప్రతిపాదించిన పనులు రద్దు చేయాలని, సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇది కేవలం నామినేటెడ్ కాంట్రాక్టర్లకు మాత్రమే లాభమంటున్నారు.

గ్రామ సమస్యలు పట్టించుకోకుండా..

ఐ.పంగిడి, దేచర్లలో అనేక మట్టి, పుంత రోడ్లు, గోతులు పడిన రహదారులు ఉన్నాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఈ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తే ఉపయోగం ఉంటుందని స్థానికులు అంటున్నారు. ప్రజలకు ఉపయోగం లేని, పారిశ్రామిక వేత్తలకు మాత్రమే ఉపయోగపడే అప్రోచ్ రోడ్డుకు ప్రజాధనం మళ్లించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. గ్లాస్ ఫ్యాక్టరీ వారు స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇవ్వటం లేదని, సీఎస్ఆర్ నిధులతో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పని చేయట్లేదంటున్నారు. నియోజకవర్గంలోనే ఎక్కువ పనిదినాలను కల్పించి, లేబర్ కాంపొనెంట్‌లో అగ్రగామిగా నిలిచిన ఐ.పంగిడి పంచాయతీలో శ్రామికుల కష్టార్జితం వల్ల మెటీరియల్ ఎక్కువగా వచ్చిందనే సత్యం మరువకూడదు. వాటిని దృష్టిలో పెట్టుకొని దేచర్ల, పంగిడి గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.


దేచర్లలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వేసిన రోడ్డు


గ్లాస్ ఫ్యాక్టరీకి వెళ్లే అప్రోచ్ రోడ్డు

టీడీపీ నేతల లాభం కోసమే నిధుల కేటాయింపు

తాళ్లపూడి(కొవ్వూరు): టీడీపీ నాయకులు తమ సొంత లాభం కోసం ఉపాధి హామీ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని దేచర్ల వద్ద త్రివేణీ గ్లాస్ ఫ్యాక్టరీ రోడ్డును ఆయన పరిశీలించారు. వెంకట్రావు మాట్లాడుతూ, ఉపాధి హామీ నిధుల రూ.కోటి, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో ఒకే రోడ్డును ఫ్యాక్టరీ వాళ్ల కోసం వేయడంతో ఎంత ప్రజాధనం వృధా చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. వెయ్యి కోట్లతో ఫ్యాక్టరీ పెట్టిన వాళ్లు రోడ్డు వేసుకోగలరని, కేవలం టీడీపీ నాయకులు నిధులు పక్కదారి పట్టించి వారి జేబుల్లో వేసుకోవడానికి ఈ రోడ్డే నిదర్శనమన్నారు. గ్రామాల్లోని రోడ్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుకు కేటాయించిన నిధులు తక్షణం రద్దు చేయాలన్నారు. ఫ్యాక్టరీ యజమాన్యం స్థానికులకు ఉద్యోగాలు కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. ఆయన వెంట నాయకులు చౌటుపల్లి వీరన్న, ఉప్పులూరి సూరిబాబులున్నారు.


దేచర్ల వద్ద ఫ్యాక్టరీ రోడ్డును పరిశీలిస్తున్న తలారి వెంకట్రావు

రసాయనిక ఎరువులు తగ్గిస్తే అధిక దిగుబడి

పెరవలి: వరిలో నాణ్యమైన దిగుబడులు సాధించాలనే తపనతో ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేస్తున్నారని, దీని వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. మండలంలోని కానూరులో సమగ్ర సస్య సంరక్షణ కేంద్రం విజయవాడ వారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో వరి, కోకో, అరటి, కొబ్బరి పంటలపై రైతులకు రెండు రోజులపాటు సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులు సేంద్రియ పద్ధతులతో సాగు చేయాలన్నారు. దీనికి పెంట అధికంగా వినియోగించటంతో పాటు మూడో పంటగా పచ్చిరొట్ట పైర్లు సాగు చేయాలన్నారు. ఏరువాక శాస్త్రవేత్త నరసింహారావు మాట్లాడుతూ, వరి సాగు చేస్తున్న రైతులు తెగుళ్ల నివారణకు ఒక్కసారే రెండు, మూడు రకాల పురుగు మందులు కలిపి పిచికారీ చేస్తున్నారని, దీని వల్ల తెగుళ్ల నివారణ ఎలా ఉన్నా మరింత ఉధృతి అవుతుందన్నారు. శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, కోకో, కొబ్బరి పంటల్లో ఎలుకల బెడదతో పాటు ఉడతల బెడద ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కోకో సాగులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అప్పుడే నాణమైన దిగుబడి వస్తుందన్నారు. కొబ్బరిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని, వేరు వ్యవస్థ దగ్గర నుంచి సాగునీరు, ఎరువులు, సేంద్రియ ఎరువులు ఎక్కువగా వేస్తే దిగుబడులు అనూహ్యంగా పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో విజయవాడ నుంచి వచ్చిన టౌ అసిస్టెంట్ మనోజురి గోస్వామి, కె.వీరయ్య చౌదరి, ఏడీఏ శ్రీనివాస్, వ్యవసాయాధికారిణి మేరీ కిరణ్, శాస్త్రవేత్తలు టి.శ్రీనివాస్, భువనేశ్వరి, ఆనంద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కానూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

మాజీ హోంమంత్రి నివాళులు

గోపాలపురం: మాజీ హోంమంత్రి తానేటి వనిత వద్ద పనిచేసే గన్‌మెన్ బూరెడ్డి సత్యనారాయణ తండ్రి బంగారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ మేరకు గురువారం బంగారయ్య సంస్మరణ సభను ఏఎంసీ ఆవరణలో నిర్వహించారు. మాజీ మంత్రి వనిత హాజరై బంగారయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, కొండవీటి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఎస్‌డీ ఆశీర్వాదం దంపతులు మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.


బంగారయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తానేటి వనిత

శ్రమదానంలో ప్రజలు భాగస్వాములు కావాలి


నిడదవోలు సంతమార్కెట్‌లో శుభ్రం చేస్తున్న కౌన్సిలర్లు, ఉద్యోగులు

నిడదవోలు: శ్రమదానంలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి అన్నారు. ప్రజల్లో పరిశుభ్రత ప్రాముఖ్యతను అవగాహన కలిపిస్తూ స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో సంత మార్కెట్ వద్ద శ్రమదానం చేశారు. మార్కెట్ పరిసరాలను చీపుర్లతో శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వజిరుద్దీన్, కౌన్సిలర్లు ఉసురుమర్తి జాన్‌బాబు, దాకే అనిల్‌కుమార్, మున్సిపల్, వార్డు సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిపోతున్న వరి పైరు


కురుకూరులో ఎండాకు తెగులు సోకిన వరిచేను

దేవరపల్లి: వరిచేనుకు పలు రకాల తెగులు వ్యాపించడంతో చేలు దెబ్బతిన్నట్టు రైతులు వాపోతున్నారు. ఆకుముడత, ఎండాకు తెగులు ఎక్కువగా వ్యాపించినట్టు అధికారులు తెలిపారు. మండలంలోని కురుకూరు, త్యాజంపూడి గ్రామాల్లో వరి పంటలను పరిశీలించగా ఎండాకు తెగులు సోకినట్టు గుర్తించినట్టు మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ గురువారం వెల్లడించారు. ఎండాకు తెగులు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు ఆరోగ్యకరమైన విత్తనాలను వాడాలన్నారు. తెగులు నిరోధకర వంగడాలను ఎంచుకుని, కలుపు మొక్కలను తొలగించి పంట అవశేషాలను బాగా దున్ని సరియైన నీటి పాదుదల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. హైడ్రాక్సైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 4 గ్రాములు లేదా పాషామైసిన్ 4 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

రోడ్డు మలుపులోపొంచి ఉన్న ముప్పు

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరులో చెరుకుమిల్లి రోడ్డు మలుపులో గొయ్యి ప్రమాదకరంగా ఉంది. వర్షపునీటితో నిండి చెరవులా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే గుండుగొలను–కొవ్వూరు ప్రధాన రహదారికి అను కుని గొయ్యి ఉండడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. అధికారులు గొయ్యిని పూడ్చి ప్రమాదాలను నివారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

చెరుకుమిల్లి రోడ్డు మలుపు వద్ద భారీ గొయ్యి →



అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చాగల్లు: దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అమ్మవారి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాగల్లులో మాతంగి చెరువు గట్టుపై ఉన్న అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చాగల్లు శివాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ధనలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని గులాబీ పూలతో అలంకరించారు. వాసవీ మాత ఆలయంలో అమ్మవారికి, మీనానగరంలో ముత్యాలదిబ్బ వద్దనున్న అమ్మవారికి భవానీలు, మహిళలు పూజలు చేశారు. బ్రాహ్మణగూడెంలో నాగారమ్మ అమ్మవారి ఆలయంలో భజన కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారిని సుందరంగా అలంకరించారు. రావులచెరువు గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఊనగట్లలో భవానీలు గ్రామోత్సవం నిర్వహించారు. ఎస్.ముప్పవరం, గరప్పాడు గ్రామాల్లోని ఆలయాల్లోనూ పూజలు చేశారు.

108 కలశాలతో మహిళల ఊరేగింపు

చాగల్లు పాటెమ్మపేటలోని పిండుంగొయ్యి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహం బాల కనకదుర్గమ్మ వారి నవరాత్ర వేడుకల్లో భాగంగా గురువారం స్థానిక మహిళలు 108 కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ప్రాంగణం నుంచి భారీఎత్తున బాణసంచా కాలుస్తూ, తీన్మార్ డప్పులతో ఊరేగింపు వేడుకగా సాగింది.


చాగల్లులో కలశాలతో మహిళల ఊరేగింపు

పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం భక్తుల కోలాహలంతో గురువారం సందడిగా మారింది. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. నాలుగో రోజు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 227 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణం, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,00,123 విరాళాలు వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు. సమిశ్రగూడెంలో పుంతలో ముసలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. గోపవరం గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. లోహియా నగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయ సహిత రాజరాజేశ్వరి దేవి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


పుష్పాలంకరణలో నిడదవోలు కోటసత్తెమ్మ

కాత్యాయనీ దేవిగా అమ్మవారి దర్శనం

గోపాలపురం: శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం కనకదుర్గమ్మ అమ్మవారిని కాత్యాయనీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని వాదాలకుంట, జగన్నాధపురం, దొండపూడి, చిట్యాల, గోపాలపురం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాలలలో అమ్మవారిని కత్యాయనీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక లలితాంభికా అమ్మవారి ఆలయంలో అమ్మవారికి కుంకుమపూజలు, లలితా సహస్ర నామార్చన నిర్వహించారు.

వైద్య శిబిరం

నిడదవోలు: స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మోకాళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, గ్యాస్టిక్ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల సౌజన్యంతో 30 మంది మధుమేహం వ్యాధిగ్రస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి విజయ్ కుమారి, కొత్తపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పండిట్ దీన్ దయాళ్‌కు నివాళి

నిడదవోలు: పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం పండిట్ దీన్ దయాళ్ జయంతిని నిర్వహించారు. దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, తంగుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


నడుపల్లిలో రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న వైద్యురాలు తేజశ్రీ, నాయకులు

పెరవలి: గ్రామీణ మహిళలు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించటంతో అనేక రుగ్మతలకు గురవుతున్నారని కానూరు పీహెచ్‌సీ వైద్యురాలు తేజశ్రీ తెలిపారు. మండలంలోని నడుపల్లిలో గురువారం ప్రజల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గ్రామీణ మహిళల్లో విటమిన్ లోపం ఎక్కువగా కనిపిస్తుందని, దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు హేమరాజు, సర్పంచ్ బీరా సత్యవేణి రాజు వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా?


నిడదవోలు- నరసాపురం రోడ్డులో ప్రొక్లెయిన్‌తో గోతులు పూడ్చివేత

పెరవలి: నిడదవోలు– నరసాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఏర్పడిన గోతులు పూడ్చటానికి ప్రమాదాలు జరిగి మరణిస్తే కానీ అధికారులు పట్టించుకోరేమో. తీపర్రులో ఆర్టీసీ బస్సు ఢీకొట్టి మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందటంతో బుధవారం గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఈ రహదారి చాలా అధ్వానంగా ఉండటంతో పగలు, రాత్రి ప్రమాదాలు జరుగుతున్నా, పత్రికలు కోడైకూస్తున్నా పట్టించుకోని అధికారులు.. ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగిన వెంటనే పనులు చేపట్టారు. బుధవారం కాపవరం నుంచి పెరవలి వరకు గోతులు పూడ్చగా, గురువారం పెరవలి నుంచి తీపర్రు వరకు గోతులు పూడ్చారు. వాహనదారులు మాత్రం గోతులను శుభ్రం చేసి తారువేస్తే కొద్ది రోజులైనా ఉంటుందని, లేకుంటే బూడిద కళ్లల్లో పడి ప్రమాదాలు సంభవిస్తాయని అంటున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ


సుజనమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తలారి వెంకట్రావు తదితరులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి సిర్రా గంగారావు, సిర్రా గోపీల తల్లి సుజనమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు గురువారం సుజనమ్మ సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ హోంమంత్రి తానేటి వనిత, ఇతర నాయకులు ఘన నివాళి అర్పించారు. అనంతరం గంగారావు, గోపీలను పరామర్శించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు యాళ్ల బాబూరావు, పిట్టా శ్రీనివాస్, గూడా విజయ రాజు, రుత్తల భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, కుటుంముక్కల కేశవనారాయణ తదితరులు హాజరయ్యారు.

కోకోతో మంచి లాభాలు


కలవలపల్లిలో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

చాగల్లు: కొబ్బరి, పామాయిల్ పంటల్లో అంతర పంటగా కోకోను వేసుకోంటే మంచి లాభాలు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారి డి.సుధీర్ కుమార్ అన్నారు. మండలంలోని కలవలపల్లిలో గురువారం రైతు ముళ్లపూడి మురళీకృష్ణ వ్యవసాయ క్షేత్రంలో కోకో, మిరియాలు, జాజికాయ, దాల్చిన చెక్క తోటలను పరిశీలించారు. కొబ్బరిలో అంతర పంటల క్రింద ఈ న్యూట్రాప్స్ వేయడంతో లాభాలు వస్తాయని తెలిపారు. సీపీసీఆర్ఐ విశ్రాంత డైరెక్టర్ చౌడప్ప, హార్టికల్చర్ అధికారి వేణుమాధవ్, ఉద్యాన, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని బసివిరెడ్డిపేట, కాటకోటేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని సమిశ్రగూడెం, అట్లపాడు, కాటకోటేశ్వరం, తిమ్మరాజుపాలెం, సూరాపురం, రావిమెట్ల, కంసాలిపాలెం, ఉనకరమిలిల గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వేగేశ్వరపురంలో వైద్య శిబిరం

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో గురువారం స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. తాళ్లపూడి పీహెచ్‌సీ డాక్టర్ హారిక గుప్తా గ్రామంలోని వృద్ధులు, బీపీ షుగర్ వ్యాధి గ్రస్తులు, టీబీ పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమిరెడ్డి పరశు రామారావు, నాయకులు, తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఓట్ల దొంగ గద్దె దిగాలి

నిడదవోలు: రాహుల్ చేస్తున్న పోరాటాలకు మద్దతుగా పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ చేపట్టారు. ఓట్ల దొంగ గద్దె దిగు అనే నినాదంతో స్థానిక గణేష్ చౌక్ వద్ద నుంచి సంత మార్కెట్ వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసనలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్, బీజేపీ కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, మార్టిన్ లూథర్, కాకర్ల శ్రీహరిబాబు, పుల్లారావు, బుజ్జిబాబు, చిన్నం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ హోంమంత్రి పరామర్శ


మర్రెడ్డి రాజారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత

నల్లజర్ల: అనంతపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు మర్రెడ్డి రాజారావు ఇటీవల తల్లివెంకయామ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి, క్రమశిక్షణ కమిటీ మెంబరు తానేటి వనిత గురువారం రాజారావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మాజీ జెడ్పీటీసీ బంక అప్పారావు, బళ్లనాని, వలిరెడ్డి అర్జున్, శ్రీకాకుళపు ఆదిత్య, తాడిగడప శ్రీనివాస్, నక్కాపండు, గోతం కృష్ణాయాదవ్, ప్రత్తి మురళీకృష్ణ, అప్పన్న, చిట్లా వెంకటేశ్వరావు, ములగాల గోపి, కడియం మురళీ కృష్ణ, గొటికల కృష్ణ, బూరెల గణపతి, చిక్కాల నాగేశ్వరావు, సువర్ణరాజు తదితరులున్నారు.

ప్రతి రైతూ మొక్కలు నాటాలి


పొగాకు బోర్డు ఆవరణలో మొక్కలు నాటుతున్న రామ్‌మీనా, సిబ్బంది

గోపాలపురం: పొగాకు బోర్డు పరిధిలోని రైతులంతా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని గోపాలపురం పొగాకు వేలం కేంద్రం ఆక్షన్ సూపరింటెండెంట్ కేవెల్ రామ్ మీనా అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏక్ దీన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపైనా దృష్టి సారించాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పొలం గట్లపై మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.